# జన్మ దినపు బహుమతి

చక్రవర్తి శకుంతల, డర్బాన్, దక్షిణ ఆఫ్రికా

కమలకు తన పెనిమిటి అంటే ఎంతో ప్రేమ: అతడు ఎన్నడూ ఆమె పుట్టిన దినం మరిచిపోడు. ఆమె స్నేహితురాండ్రు ఎందరో ఉన్నారు. కాని వారల భర్తలు వాళ్ళ వయసు మాత్రమే జ్ఞాపకం పెట్టుకుంటారు. జన్మ దినం మాట తలపనేతలవరు.

ఆనాడు ప్రొద్దున్నే కాఫీ పుచ్చుకోడానికి ఇద్దరూ టేబిలుమీద కూచున్నప్పుడు, కమల తన ప్లేటుక్రింద తెల్లనికవరులో కొత్త నూరు రూపాయిలనోటు పెట్టి ఉండడం చూసుకుంది. దాన్ని తీసుకొని ఆమెలేచి అతని ప్రక్కకుపోయి అప్పుడప్పుడే కొంచెం పలచ బడుతూవున్న అతని శిరస్సుపైన తన ప్రేమ చిహ్నంగా తన పెదవులు అద్దింది.

"అదుగో, అదుగో, వానన వస్తూంది మాడిపోయి నట్టు" అని జగన్నాథరావు మృదువుగా ఆమెకు పెనం మీద పెసరట్టుమాట జ్ఞాపకం చేశాడు. కమలకు బాగా తెలుసును, కొంచెం మాడువానన వస్తే జగన్నాథరావుకు సహించదని.

"అయ్యో, నాకు బొత్తిగా మతి ఉండడంలేదు ఈ మధ్యన" అంటూ కమల దాన్ని తిరగేసి మళ్ళీ వచ్చి కూర్చుంది.

"ఈచిన్న బహుమతిని ఎలా ఖర్చు పెట్టడానికి ఆలోచిస్తున్నావు?" అని జగన్నాథరావు అడిగాడు. ఆమెకు ఎన్నో తలంపులు ఉండవచ్చును అని అతనికి తెలుసును.

రెండు నిమిషాలదాకా ఆమె నిశ్శబ్దంగా ఉండి ఏదో ఆలోచించుకొని "టౌనుకు పోయి నాలుగు అంగళ్ళూ చూసి, మంచి....మంచి...." అంటూనే కమల నిలిచి పోయి, అలాంటి ఖర్చులకు జగన్నాథరావు ఒప్పుకుంటాడా అని జంకింది. అయితే అంతకుముందే ఆగుడ్డలకు అడ్వాన్సు ఇచ్చివచ్చింది, ఈ బహుమతి ఎలాగావస్తుంది కదా అని.

"మంచిది, ఏం కొంటావు కమలా? నీ యిష్టం ఏమైనా కొనుక్కో, దానికేమీ నాకు దమ్మిడీలతో లెక్క చెప్పనక్కరలేదు" అంటూ చిరునవ్వుతో ఆమె మానసిక వ్యగ్రతను మాన్పించాడు జగన్నాథరావు.

తాను అతనిని నమ్మలేదన్న భావం కనపడిందని కలుగుతూన్న చిరునవ్వును అణచుకుంటూ కమల - మీకు నాయందు అంత ప్రేమ ఉన్నది కనుక నేను చాలా అదృష్టవంతురాలను" అని పరధ్యానంగానే అన్నది. ఇద్దరూ ఇంకా ఏవో మాటలు అక్కడ కూచున్నంత సేపూ మాట్లాడుకుంటూనే ఉన్నారు.

"తలుపులు భద్రంగా తాళం పెట్టడం మరచిపోవద్దు కమలా," అంటూ బయటి గేటు దగ్గరకు పోయి కేక వేశాడు. "నాకంటే ముందు నీవే యింటికి చేరుతావను కుంటాను."

"Oh yes" అని ఇంటిగుమ్మంలోంచి కమల కేక వేసింది "Good-bye."

ప్రొద్దుటి కాఫీ కప్పులు కడిగిపెట్టుకోడం, మిగిలిన యింటిపని, అంతా నిమిషాలమీద ముగించుకుంది. టౌనుకు పోవడానికి గుడ్డలు వేసుకొని తయారైంది.

తన తలంపులన్నీ, తాను ఎలాంటిగుడ్డలు కొనవలెనో అనీ, ఆ గుడ్డలు కొనే అంగళ్ళలో ఉండేనౌకరులు తను ఈ వయస్సులో, చిన్నయువతులు ఉపయోగించే, ఇలాంటి గుడ్డలు కొంటూవుంటే నవ్వుకోరా అనీ, ఈ ఆలోచనలమీదనే కేంద్రీకరించుకొని ఉన్నాయి.

తలుపులు భద్రంగా తాళాలు పెట్టుకొని స్టేషనుకు చేరింది. కొంచెంసేపట్లో రైలుబండి వచ్చింది. ప్రయాణం కులాసాగా ఉండేందుకని, ఇంకో స్త్రీమాత్రమే కూర్చొని ఉన్న సెకండుక్లాసు పెట్టెలో ఎక్కికూచుంది.

తనకు ఎదురుసీటులో కూచొని ఉన్న స్త్రీ ఆకుపచ్చ రంగు బనారసు చీరె కట్టుకొనివుంది. అయితే చూపులకు

ధనవంతుల కుటుంబంలోనిదే అన్నట్టు కనబడుతూ వుంది. ఆమెను చూడగానే ఏమోగాని కమల మనస్సులో ఆమెయందు ప్రేమగాని మంచి తలంపుగాని కలగలేదు. కమల చూపులనుబట్టి ఆమె మనస్సు గ్రహించినదానిలాగ ఆ స్త్రీకూడా పెడమొహం పెట్టుకొనే కూచుంది. ఆమె తన నల్లనిపెద్ద చేతి సంచిలోంచి సిగరెట్టు తీసి వెలిగించి బయటి వైపు దృశ్యాలు చూస్తున్నట్టుగా కూచుంది.

బండి టౌనుకు చేరటానికి రమారమి ఒక గంట కాలం పడుతుంది. తాళగతిలోవున్న రైలు చక్రాల చప్పుడు కమలకు కొంచెం మాగన్ను కలిగేట్టుగాచేసింది. అందులోనే ఆలోచన: "అప్పుడే ఒక సంవత్సరం ఎలాగ గిర్రున తిరిగిపోయిందో" ఆచక్రాల చప్పుడు "నీకు వయసు పెరుగుతూంది ; నీకు వయసు పెరుగుతూంది" అంటూ పాడుతూన్నట్టుగా కమల మాగన్నుగా ఉండే తలచుకుంటూంది. అది బాగా లేదని కష్టంమీద ఎలాగో ఆ తాళగతిని "పచ్చ నోటు ఖర్చు పెట్టు; పచ్చ నోటు ఖర్చు పెట్టు" అనే మాటలుగా మార్చుకొని మనస్సుకు ఉత్సాహం తెచ్చుకుంది.

బహుశా, యీతలంపే ఆమె హృదయంలో నూతన చైతన్యం కలిగించి, ఆ నిద్రమగతను పోగొట్టింది. అంతలోనే బండి ఒక సొరంగంలోంచి పోతూవున్నందున అంతా చీకటి అయిపోయింది. ఆ చీకట్లో తన మోకాళ్ళకు రాచుకుంటూ ఎవరో నడిచినట్టుతోచింది. కమల ఉలికిపడి లేచి సరిగాకూచోని, పగటివేళ తనకు ఈ నిద్రమగత కలిగినందుకు తనను తానే నిందించుకొని కుదుటపడింది. ఆ ఎదురుసీటులో కూచున్న ఆడది ఆ మూల దూరంగా కూచోని కిటికీవైపు మొహం పెట్టుకొని కళ్ళుమూసుకొనివుంది.

మనస్సులో కలిగిన చిన్న ఆందోళన కుదురుబాటు చేసుకోడానికి, తన పచ్చనోటు ఉందో లేదో అని చూసుకోడానికి కమల hand bag తెరిచి చూచుకుంది. పౌడరు Compact పక్కనే అద్దం వెనుక తాను పెట్టిన కవరు ఉంది....అయితే కవరు చిరిగిపోయివుంది. గుండెలలో గతుక్కుమంది....కంగారుగా వణకుతూన్న వ్రేళ్ళతో కవరు ఎత్తిచూచింది. ఉత్త కవరు....లోపల నూరు రూపాయలనోటులేదు. ఇంకా కంగారుగా ఆప్రక్కను, ఈప్రక్కను, Bag అంతటా వెతికింది. మధ్యనువున్న Zipతో బిగించివున్న పర్సులో ఉందేమోనని అదీ తెరిచి చూచింది. అక్కడాలేదు పచ్చనోటు. ఆమె జన్మదినపు బహుమతిపోయింది.

కమలకు కండ్లలో నీరు గిర్రునతిరిగింది; ఆమెగుండెలు వేగంగా కొట్టుకోనారంభించినవి. ఎలాగ?.... ఎందుకని?.... ఎక్కడ?.... ఒకవేళ— ఆ భయంకరమైన తలంపు ఆమెకు కలిగింది— ఆ ఎదురుసీటులో కూచోని, నోరు సగం తెరుచుకొని, కండ్లు మూతలుపడి, గాఢ నిద్రపోతూన్నట్లున్న ఆ ఆడది ఎవరు?

కమల తనస్థితిని చూసుకొని తానే భయపడిపోయింది. ఈరోజుల్లో రైలుబళ్ళల్లో ఇంకా ఇంతకంటే ఘోరమైన విషయాలు జరుగుతున్నాయి. మగపిల్లలు ఆడపిల్లల్లాగ వేషాలు వేసుకొని ఒంటరిగాపోతూన్న మగవాళ్ళను మోసగించి, దోచుకొనిపోవడం ఇలాంటివి ఎన్నెన్నో జరుగుతున్నాయి. తన కళ్ళముందే, ఎంతో మర్యాదగా ఉన్నట్టు పైకి అగపడుతూన్న ఆ స్త్రీ ఇంత బందిపోటు దొంగ అయిపోయిందా అని తనలో తాను అనుకుంది. ఆమె వైపు క్రీగంట చూచింది. ఆ స్త్రీ మళ్ళీ కళ్ళు మూసుకొని ఏదో పరధ్యానం చూపించింది. సిగరెట్టు కాల్చి కాల్చి, అసహ్యంగా మరకలెక్కిపోయిన తన పొడుగాటి వ్రేళ్ళు పెదవులమీద పెట్టుకుంది. తన నల్లని పెద్ద చేతిసంచీ (Hand bag) మోకాళ్ళమీదనుంచి వ్రేలాడేట్టు ఒకచేత్తో పట్టుకుంది. అది రైలు ఊపులకు ఊగిసలాడుతూవుంది. మళ్ళీ ఆ ఆడది కమల వేపు ఒక వింత చూపుచూసి, నిర్లక్ష్యంగా "పొగత్రాగరాదు" అని రాసివున్న బండిలోనే సిగరెట్టు కాల్చడం మొదలెట్టింది.

ఈవింత నడతయే కమలకు ఈభావికార్యానికి మనస్సులో నిశ్చయం చేసుకోడానికి ఆధారమైంది.

"నేను నిద్రపోతూ ఉండగా ఈ ఆడదే నా నోటు అపహరించివుంటుంది మంచిది:—ఇప్పుడు కథ అడ్డం తిరుగుతుంది. కన్నగాని ఇంటికే దొంగలు పడతారు." అనుకుంటూ వణకుతూన్న చేతులతో — ఒకవేళ ఉన్నట్టుండి ఆ ఆడది మేలుకుంటే—ఒకవేళ బండి స్టేషను చేరుకొంటే—కమల నెమ్మదిగా ఆ ఆడదాని నల్లని, పెద్ద చేతిసంచికొక్కెం తొలగించింది. ఒకవేళ తనదే పొరబాటయితే— అయినా తప్పేముంది? నెమ్మదిగా.... అదుగో నెమ్మదిగా.... అదేమిటి? చురుకుగా కమల వేళ్ళు మాసిపోయిన Chiffon చేతి

రుమాలులో చుట్టపెట్టి, పౌడరు అద్దుకొనే కుంచెపక్కనే. పెళపెళలాడుతూన్న ఏదో వస్తువును తాకింది. చాలా జాగ్రత్తగా, నేర్పుతో—ఎన్నో ఏండ్లనుంచి ఈవృత్తి చేస్తున్నట్టు—కమల దానిని పైకి లాగింది. చూచిఉలిక్కిపడింది. అది వందరూపాయల నోటు; తన వంద రూపాయల నోటు.

ఇలా దొంగిలించడానికి ఆ ఆడదానికి ఎంత ధైర్యం? ఎంతో సంతోషంతో గడుపుకొందామనుకున్న రోజును ఇలాగ నాశనం చెయ్యడానికి సమకట్టిందే?

కమల ఆనోటును భద్రంగా తన చేతిసంచిలో Zipతో బంధించిన పర్సులో పెట్టి బిగించి, కొట్టుకుంటూన్న గుండెలతో కళ్ళుమూసుకొని తనసీటులో పదిలంగా కూర్చుంది. రైలుపక్కన దృశ్యాలు చూడటానికి ఆమెకు మనస్సుపోలేదు. పోనీ, ఆ ఆడదాన్ని నలుగురిలోకి యీడ్చి బుద్ధి చెప్పవచ్చునా అంటే, అది సాధ్యంకాని పని కాదు. ఏమీ ఎరగనట్టు నోరుమూసుకొని కూచోడమే మంచిది. ఆ ఆడది నీచత్వానికి పాల్పడి ఈవిధంగా దొంగిలించిందే, అన్న కోపం ఊరికే పొంగివస్తూంది. ఇదే నాకు ఈలోకంలో ఆఖరినోటు అయివుంటే—దీంతో నేను తిండికి మొహంవాచే స్థితిలోవుంటే—ఇది ఎంతకాలంనుంచో కడుపుకట్టుకొనికూడ బెట్టిన సొమ్ము అయివుంటేకూడా ఈ ఆడది ఇలాగే చేసేదికదా.

ఇంతలో స్టేషను రావడంతోనే కమల మనస్సులోని ఈ తలంపులకు భంగం కలిగింది. తలుపులు తీయడం, మూయడం, కూలీలకేకలు, మామూలుగానే గందరగోళం కలిగించినవి. ఎదురుసీటులో కూచున్న ఆడది వెంటనేలేచి, కంగారుగా తలుపుతెరుచుకొని బయటకు దూకింది. ఒకే పరుగున వెళ్ళిపోయింది.

కమల, అలాగే నోరుమూసుకొని కూచుంది. "అది మంచిదే అయింది. ఇద్దరూ, ఒకే స్టేషనులో దిగటం వస్తే, టిక్కెట్టుకోసం చేతిసంచి ఇద్దరూ ఒకేచోట తెరిస్తే, తను దొంగిలించిన నోటు లేకపోయినందుకు ఆ ఆడదీ నామీద నేరంమోపి ఉండేదేమో.

టౌనుకు చేరినతరవాతకూడా ఈవిచిత్ర సంఘటనవల్ల కమల హృదయం కొట్టుకుంటూనే ఉంది. ఎవరితోనైనా చెప్పుకొందామంటేకూడా ఎవరూలేరు. సాయంత్రం వరకూ తనలోనే దాచిపెట్టుకోవాలె. కొందరికిమల్లే, దారే పోయేవాళ్ళతోనూ, కూరలమ్మడానికి వచ్చేవాళ్ళతోనూ సోదిపెట్టుకోడానికి కమలకు యిష్టంలేదు. భగవంతుడు తనను ఈవిధంగా కాపాడినందుకు కృతజ్ఞతవహించి, ఆ ఉద్వేగాన్ని తొలగించుకోడానికి, ఒక కప్పు కాఫీ త్రాగడానికి, ఒక Cafe లోకి పోయింది.

మిగిలిన దినం అంతా కులాసాగానే గడిచిపోయింది. కావలసిన సరుకులన్నీ కొనుక్కుంది. ముఖం మేకప్ చేయించుకుంది. తలకు నొక్కులన్నీ సరిగావచ్చేట్టు దువ్వించుకుంది. చేతులగోళ్ళు కత్తిరింపించుకోడం రంగు వేయించుకోడం వగైరా అంతా చేసుకుంది. తనుకోరిన దుస్తులు ధరించుకొని ముస్తాబై ఇంటిముఖం పట్టింది.

మళ్ళీ రైలులో ఎక్కినప్పుడే తనకు ఆ ప్రొద్దుటి సంఘటన జ్ఞప్తికి వచ్చింది. ఇంటికి చేరింది. ఈసంగతంతా జగన్నాధరావుకు చెప్పేవరకూ ఓపిక చాలటంలేదు. మేడపైకిపోయింది. కాని తెచ్చిన సరుకులన్నీ అక్కడ పెట్టేసింది. నిలువుటద్దంలో తనను చూసుకొని తనలో తాను మెచ్చుకుంది. కిందికి వచ్చి వంటమొదలుపెట్టింది. బంగాళాదుంపల వేపుడుకూర, ఉల్లిపాయల పులుసు చేసి అప్పడాలు వేచింది. భోజనానంతరం అల్పాహారానికి ఐస్క్రీమ్, ఫ్రూట్ సెలాడ్ తయారుగా పెట్టింది.

ఇంతలో జగన్నాధరావు వచ్చి తలుపు తాళంలో తాళం చేయితిప్పిన శబ్దం వినిపించింది. తిన్నగా పంపుదగ్గరకు పోయి చేతులు మొహం కడుక్కొని, మామూలుప్రకారం డైనింగు రూములో టేబిలు, కుర్చీలు సర్దుతూన్నాడు. కమల భోజన సామగ్రి అంతా "ట్రాలీ"మీద అమర్చి డైనింగు రూములోకి నెట్టుకుంటూ వస్తూ "ఏమండీ ఎలాగున్నాను? ఇవేళ ఏమన్నా తేడాగా కనపడుతున్నానా?" అని అడిగింది.

జగన్నాధరావు ఆమెవంక తేరిపార చూస్తూ, "Oh yes. చాలా బాగున్నావు. అయితే ఆ తల దువ్వటంలో కొంచెం నొక్కులు మరీ అంతలోతుగా లేకపోతే, ఇంకా బాగుండును. అదిసరేకాని, నాకిదేమీ అర్థంకావడంలేదు." అంటూ తన చేతివేళ్ళసందున ఏదో పెళపెళలాడిస్తూ, "డబ్బు చేతిలో ఏమీ తీసుకుపోకుండా, ఇదంతా ఎలాగ సమర్థించుకొని వచ్చావో, నాకు అర్థంకావడంలేదు. ఇదిగో, టేబిలుక్రింద పడివున్న పొద్దుటి వందరూపాయల నోటు ఇప్పుడే ఎత్తాను."